క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు, అయోధ్యనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగేశ్వరపేట మెయిన్ రోడ్డు, అయోధ్య టవర్స్ రామలింగేశ్వరపేట జీరో లైన్ నుంచి 7వ లైన్ వరకు, శాంతినగర్ జీరో లైన్ నుంచి సెకండ్ లైన్ వరకు, బసవతారక నగర్ జొంక్ రోడ్డు, లోటస్ సెక్టార్ ఫోర్, లోటస్ ల్యాండ్ మార్క్ హెచ్ఆర్‌టీ ఫస్ట్ బ్లాక్ నుంచి ఫిఫ్త్ బ్లాక్ వరకు, లోటస్ సెక్టార్ ఫైవ్, లోటస్ సెక్టార్ -3, లోటస్ మెయిన్ రోడ్డు, కేదారేశ్వరపేట జీరో లైన్ నుంచి ఐదో లైను వరకు, చల్లపల్లి వారి వీధి, జీఎస్ రాజు రోడ్డు, రాణా ప్రతాప్ రోడ్డు, కొమ్ముువారి వీధి, బ్రహ్మయ్య పంతులు వీధి, సుమాణం వారి వీధి, అమలి స్కూల్, మారుతి వ్యాయామశాల, భగత్‌సింగ్ రోడ్డు, జనార్దనరావు వీధి పాపరాజు వీధి, కనకరాజు వీధి, కావూరు వారి వీధి, నర్రా వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

దోమల నివారణకు చర్యలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో దోమల నివారణ చర్యలు వేగవంతం చేశారు. ఇప్పటికే బుడమేరులో పేరుకుపోయిన చెత్తచెదారం, గుర్రపుడెక్కను తొలగించారు. ఇప్పుడు దోమల లార్వా పెరగకుండా ముందస్తు జాగ్రత్తగా బుడమేరులో డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా బోట్ల ద్వారా చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమాలను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రత్నావళి, బయాలజిస్టు సూర్యనాయక్, కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. దోమల నివారణ చర్యలు క్రమం తప్పకుండా నిర్వహించటంతో పాటు నీటి నిల్వ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ మలేరియా, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంజింపజేసిన వీణాగానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఎస్. సుజాత బృందం వీణాగానం భక్తులను రంజింపజేసింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఎస్.సుజాత బృందం పలు కీర్తనలను వీణపై మృదుమధురంగా గానం చేశారు. సుజాతకు ఎస్ఎస్ కల్యాణరావు, హరిబాబు చక్కటి సహకారం అందించారు. అనంతరం సుజాత బృందానికి ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తుల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం గులాబీతోట అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు బీఆర్టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన డెప్యూటీ గవరన్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ సహకారంతో వస్త్రాలు పంపిణీ చేశారు. వాకర్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు వస్త్రాలు, పండ్లు, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. డెప్యూటీ గవరన్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ బాధ్యతగా తాము చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, క్లబ్ సభ్యులు, అంగన్‌వాడీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ పాఠశాల 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.వి.విజ్ఞాన కేంద్రంలో సందడిగా జరిగింది. నాటి విద్యార్థి, ప్రస్తుతం తిరుపతి ఇస్కాన్ ప్రతినిధి అయిన నరసింహారావు(నిత్య ముక్తాదాస్) మాట్లాడుతూ అన్ని బంధాల్లో స్నేహబంధం చాలా గొప్పదన్నారు. 28 ఏళ్ల తర్వాత అందరం కలిసి సమావేశం కావడం, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.
ప్రభుత్వ పాఠశాలలో చదివి చాలా మంది ఉన్నత స్థానంలో ఉన్నారని, అందరం కలిసి సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు.

వరలక్ష్మీదేవి.. పాహిమాం..



శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో..



వరలక్ష్మీ దేవి అలంకారంలో కాళీమాత



ప్రత్యేక పూల అలంకారంలో పద్మావతిదేవి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అష్టైశ్వర్య ప్రదాయిని.. వరలక్ష్మి అంటూ భక్తజనం అమ్మవారిని మనసారా పూజించారు. వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.లక్ష్మీదేవికి ప్రీతికరమైన శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతం పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం, ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా శ్రీచక్ర అర్చన, కుంకుమ పూజలు చేశారు. పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ల మూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.
కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా కాళీమాత అమ్మవారు వరలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు, పూజ, పుష్పార్చన నిర్వహించి సువాసినులతో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేయించారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని పద్మావతీదేవికి ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ మహాలక్ష్మీ స్వరూపమైన వరలక్ష్మీదేవిని పూజిస్తే సిరిసంపదలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

పాతశివాలయంలో

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారు వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని ఇతర ఉపాలయాల్లోనూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈఓ నాగరాజు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా దీపోత్సవం

శ్రీ కన్యకాపరమేశ్వరి కోదండరామ దేవస్థానం (కొత్తగుళ్ల) ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో వేంచేయించి సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమాలను అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు



శ్రీదత్తసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురం ఆర్ఎంపీ, గ్రామీణ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రకాల క్యాన్సర్‌లు పొగాకు, మద్యం, కొన్ని రకాల రసాయనాలు వంటి పర్యావరణ కారకాలతో వస్తాయని అన్నారు. జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. అనంతరం అవగాహన ర్యాలీను ప్రారంభించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంఎస్ రాజు, రాష్ట్ర కోశాధికారి నాగేంద్రరావు, నగర అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి బర్కతుల్లా, గౌరవాధ్యక్షులు పీ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. అనంతరం క్యాన్సర్ అవగాహన పోస్టర్‌లను ఆవిష్కరించారు.

19న మాలల సమావేశం

పటమట(విజయవాడతూర్పు): ఎస్సీ రిజర్వేజన్ వర్గీకరణ జరిగితే విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఎస్సీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టు తీర్పును పునసమీక్షించుకోవాలని కోరుతూ ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మాలల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు అధ్యక్షుడు పంతగాని రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పంటకాల్వరోడ్డులో ఉన్న స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి



న్యాయవాది హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. అయోధ్యనగర్‌లోని వాయిద్యకళాకారుల సంఘ కార్యాలయంలో వాయిద్య కళాకారుల సమ్మేళనం, కళాకారుల ఆత్మీయ సమావేశ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని అనేక దేవాలయాల్లో వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కళాకారులు ఐక్యంగా పనిచేయాలని అప్పుడే విజయాలు సాధించగలమని తెలిపారు. వాయిద్య కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యలమందరావు మాట్లాడుతూ న్యాయ సలహాలకోసం న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తాను నియమించామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ రామ్మోనరావు, సంస్థ సభ్యులు సూరవరపు నాగరాజు, లంక మహేష్, ఆకునూరు సుబ్బారావు, సీతయ్య, రఘునాథ్, కేవీ రామారావు పాల్గొన్నారు. జిల్లా నుంచి వచ్చిన వాయిద్య కళాకారుల బృందాలు వాగ్గేయకార కీర్తనలను పలికించారు. హజరత్తయ్యగుప్తాను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఎస్‌ఐల బదిలీలు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం ఎం.వెంకటేష్ ఒకటో ట్రాఫిక్‌కు, టి.కరుణాకర్ రెండో ట్రాఫిక్‌కు, కె.సాయిచంద్ర రెండో ట్రాఫిక్‌కు, పి.రాజేంద్రబాబు ఐదో ట్రాఫిక్‌కు, వి.శివరామ్‌బాబు టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న డి.హరికృష్ణ, జి.రేవతి పటమటకు, కె.విజయ్‌కుమార్ గుణదలకు, అబ్దుల్‌రకీబ్ గుణదల క్రైంకు, కె.సంతోషమ్మ, ఎ.సూర్యనారాయణ కృష్ణలంకకు, బి.రవితేజ, కె.సత్యనారాయణ సూర్యారావుపేటకు, బి.లక్ష్మీనారాయణ గవర్నర్‌పేటకు, ఎల్.రజితరాణి, జి.వి.బి.వి. ప్రసాద్ సత్యనారాయణపురానికి, అబ్దుల్‌కలాం వన్‌టౌన్‌కు, కె.విజయ్‌కుమార్, ఎం.విజయకుమారి టుటౌన్‌కు, కె.నాగేశ్వరరావు, డి.ఆనందకుమార్, పి.ఎస్.ప్రకాష్‌రావు, ఎస్.ఫ్రాన్సిస్ భవానీపురానికి బదిలీ అయ్యారు.వి.వెంకటరావు గుణదల నుంచి తిరువూరుకు, ఆర్.శ్రీకృష్ణవర్మ సీఎస్‌బీనుంచి పటమటకు, ఎ.దుర్గాదేవి భవానీపురం నుంచి పటమటకు, యు.హైమావతి కంచకచర్ల నుంచి మాచవరానికి, ఎస్.దుర్గాభవాని సత్యనారాయణపురం నుంచి మాచవరానికి, ఆర్.ధర్మరాజు చందర్లపాడు నుంచి గుణదలకు, వి.సతీష్ చిల్లకల్లు నుంచి కృష్ణలంకకు, బి.అభిమన్యు వత్సవాయి నుంచి కృష్ణలంకకు, జి.వి.వి.సత్యనారాయణ తిరువూరు నుంచి సూర్యారావుపేటకు, వై.దుర్గారావు కృష్ణలంక నుంచి గవర్నర్‌పేటకు, ఎం.ప్రశాంతి వన్‌టౌన్ నుంచి గవర్నర్‌పేటకు, ఎండీ షబ్బీర్‌అహ్మద్ జి.కొండూరు ఉంచి సత్యనారాయణపురానికి బదిలీ అయ్యారు. ఎస్.రామకృష్ణ సీఎస్‌బీ నుంచి సత్యనారాయణపురానికి, ఎం.సూర్యభగవాన్ జగ్గయ్యపేట నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు, బి.అనూష భవానీపురం నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు, ఎస్.శ్రీనివాసరావు నున్న నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. షరీఫ్‌మహబూబ్ కృష్ణలంక నుంచి నున్నకు, కె.సరళ సత్యనారాయణపురం నుంచి వన్‌టౌన్‌కు, కె.రఘునాథ్ సీఎస్‌బీ నుంచి వన్‌టౌన్‌కు, ఎ.పద్మారావు జగ్గయ్యపేట నుంచి టు టౌన్‌కు, కె.వి.జి.వి.సత్యనారాయణ తిరువూరు నుంచి టు టౌన్‌కు, కె.నాగేశ్వరరావు టు ట్రాఫిక్ నుంచి సీసీఎస్‌కు, ఎస్.వల్లీపద్మ పటమట నుంచి సైబర్‌కు, ఎస్.నాగేశ్వరరావు ఎస్ఈబీ నుంచి సైబర్‌కు, టి.తిరుమలరావు సీఎస్‌బీ నుంచి సీటీఎఫ్‌కు బదిలీ అయ్యారు. బి.ఆనందబాబు ఒకటో ట్రాఫిక్‌కు, ఎ.శ్రీనివాసరావు, జె.రంగయ్య మూడో ట్రాఫిక్‌కు, వై.కృపానందం, బి.వి.రామారావు సీసీఎస్‌కు, డి.ఆనందకుమార్(ఎస్ఐ634), బి.హైదేశ్వరరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, కె.నబి, ఎల్.నాంచారయ్య, బి.ఎ.స్వర్ణకుమారి, కె.శేషారెడ్డి, జి.కృష్ణారావు, అయుబ్‌ఖాన్, ఎస్.రమేష్‌బాబులు సీఎస్‌బీకి, వై.డి.కృపావరం పీసీఆర్‌కు, బి.శైలజకుమారి వీఆర్‌కు బదిలీ అయ్యారు. షరీఫ్ మహబూబ్ కృష్ణలంక నుంచి నున్నకు, కె.సరళ సత్యనారాయణపురం నుంచి వన్‌టౌన్‌కు, కె.రఘునాథ్ సీఎస్‌బీ నుంచి వన్‌టౌన్‌కు, ఎ.పద్మారావు జగ్గయ్యపేట నుంచి టు టౌన్‌కు, కె.వి.జి.వి.సత్యనారాయణ తిరువూరు నుంచి టు టౌన్‌కు, కె.నాగేశ్వరరావు టు ట్రాఫిక్ నుంచి సీసీఎస్‌కు, ఎస్.వల్లీపద్మ పటమట నుంచి సైబర్‌కు, ఎస్.నాగేశ్వరరావు ఎస్ఈబీ నుంచి సైబర్‌కు, టి.తిరుమలరావు సీఎస్‌బీ నుంచి సీటీఎఫ్‌కు బదిలీ అయ్యారు. కె.శారదసతీష్(వన్‌టౌన్), పి.ధనలక్ష్మీప్రసన్న(అజిత్‌సింగ్‌నగర్), సి.హెచ్.కె.డి.ప్రసాద్(పటమట), సి.హెచ్.నాగదుర్గ(వన్ ట్రాఫిక్), కె.పూర్ణిమరమణి(గుణదల)లను ఏలూరు రేంజికి సరెండర్ చేశారు.



డాక్టర్ల నిరసన





కోల్‌కతాలోని వైద్యకళాశాల ఘటనలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నగరంలో శుక్రవారం జరిగిన నిరసనలో సిద్ధార్థ వైద్య కళాశాల, నిమ్రా వైద్య కళాశాల, పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, ఎన్ఆర్ఐ, ఎయిమ్స్ మంగళగిరిల నుంచి జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు, పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు. విజయవాడలో జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించారు. డాక్టర్లు 'ఘటన'పై స్కిట్స్ నిర్వహించారు. ఎంజీ రోడ్డులో ర్యాలీ చేసి క్యాండిల్స్ వెలిగించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేటి నుంచి శ్రీవారి సన్నిధిలో పవిత్రోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయమైన పాతబస్తీ బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. 17వ తేదీ శనివారం ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలి రోజు శ్రీ విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షా స్వీకరణ, మేదినిపూజ, అంకురార్పణ, విభసన కల్పసూత్రం, మంత్ర ప్రశ్నాష్టకం పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయి. 18వ తేదీన అగ్నిప్రతిష్టాపన, పవిత్రశయ్యాధివాసం, హోత్రప్రశంసన, సర్వదేవతాహ్వన హోమాలు ఉంటాయి. 19వ తేదీ స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని పంచామృత అభిషేకం, వేదాంత దేశికులు, లక్ష్మీహయగ్రీవ, శ్రీ విఖనసాచార్యుల జయంతి కార్యక్రమాలు, దమకోత్సవం, శ్రీ విష్వక్సేనపూజ, వర్ధవర్ధ హోమాలు, సాయంత్రం స్వామి వారికి శ్రీవారి కల్యాణోత్సవం ఉంటాయి. 20వ తేదీన పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ప్రధానార్చకులు వివరించారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆకలితో ఉన్న పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం కార్పొరేటర్ చెన్నగిరి రామ్మోహనరావుతో కలిసి ప్రారంభించారు. తొలిరోజు అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వెలుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

120మందికే అల్పాహారం

అయోధ్యనగర్ అన్న క్యాంటీన్‌లో తొలిరోజు 350 మందికి అల్పాహారం అందించాల్సి ఉండగా కేవలం 120 మందికి మాత్రమే అల్పాహారం అందజేశారు. తొలిరోజు కావటంతో పొరపాటుగా తక్కువ అల్పాహారం వచ్చిందని ఇక నుంచి సక్రమంగా పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెనమలూరు: పోరంకి గ్రామంలోని అనాథాశ్రమంలో ఉన్న పిల్లలకు శుక్రవారం దాతలు నిత్యావసర సరుకులు అందజేశారు. బ్యాంకు ఉద్యోగులు, మాజీ సైనికోద్యోగులు కలిసి ఏర్పాటు చేసిన లైక్ మైండెడ్ పీపుల్స్(ఎల్ఎంపీ) ఆధ్వర్యంలో చిన్నారులకు పండ్లు, స్వీట్లు, రూ. 15 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రానున్న కాలంలో ఎల్ఎంపీ సేవా సంస్థ నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రూప్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానూరు యూనియన్ బ్యాంకు అధికారులు వి. శ్రీనివాస్, బీవీజీ మూర్తి, జి. ప్రసాద్, శివరామకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఫోరం ఫర్ ఆర్టిస్ట్ విజయవాడ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని ఎంబీవీకే ఆడిటోరియంలో జయహో భారత్ ఆర్ట్ కాంటెస్ట్ పేరుతో గురువారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరిల్లో బహుమతులను పొందారని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు చెప్పారు. విజేతలను కళాశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. సూపర్ సీనియర్స్ విభాగంలో పురోగమన వైతాళికుల పొట్రేట్ చిత్రాలు అనే అంశంలో బి.అర్జున్ సుతర్ ద్వితీయ బహుమతి, బీట్ బాక్సింగ్ ప్రదర్శనలో ఎన్.గోపి మనోజ్ బహుమతి పొందారని తెలిపారు. మరికొంత మంది ప్రతిభ చూపి ప్రోత్సాహక బహుమతులు పొందారని పేర్కొన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఇంద్రకీలాద్రిపై శ్రావణ సందడి



శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవత్రం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారి సన్నిధిలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు 'ఇస్తి నమ్మ వాయనం' అంటూ ఇచ్చి పుచ్చుకున్నారు. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





భర్తపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కట్టుకున్న భర్త పట్టించుకోవడం లేదని, తనను హైదరాబాద్‌లో వదలిపెట్టి వచ్చేశారంటూ శుక్రవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్‌కు చెందిన సాదరబోయిన దీనకు కైకలూరుకు చెందిన సుధీర్‌తో 2022లో వివాహమైంది. ఆ సమయంలో రూ.1.50 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఆ తర్వాత సుధీర్ వేరే మహిళతో ఫోన్‌లో చాటింగ్ చేస్తుండటంతో దీన, భర్తకు మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. జనవరిలో వ్యాపారం నిమిత్తం హైద్రాబాద్‌కు ఫ్యామిలీ షిఫ్ట్ చేశారు. అయితే సుధీర్.. దీనను హైద్రాబాద్‌లో వదలిపెట్టి విజయవాడ వచ్చేశాడు. దీన నగరానికి వచ్చి భర్త సుధీర్‌పై గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇంటి తలుపులు పగలకొట్టి చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంటి తలుపులు పగలకొట్టి ఇంట్లోని సుమారు. రూ. 1.65 లక్షల విలువైన నగదు, బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల మురళీనగర్‌కు చెందిన కొంకిమల్ల శివరామకృష్ణ తినుబండారాల వ్యాపారి. ఆయన ఈ నెల 14వ తేదీన కుటుంబ సభ్యులతో గుంటూరు వెళ్లారు. 15వ తేదీ రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలకొట్టి కనిపించాయి. ఇంట్లో సామగ్రి చిందర వందరగా ఉంది. బీరువాలో ఉండాల్సిన నగదు రూ. లక్షా ఇరవై వేలు, 9 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో శుక్రవారం శివరామకృష్ణ గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెస్ క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహకం

గన్నవరం రూరల్: క్రీడాకారులకు సాయం అందించడం అందరి బాధ్యత అని ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమి చైర్మన్ బొబ్బా రత్నారావు అన్నారు. శుక్రవారం విజయవాడకు చెందిన ఏపీ జూనియర్ చెస్ ఛాంపియన్ సీహెచ్ శర్వాణీకి దాత మేచినేని సత్యనారాయణ రూ.6వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు.